# చికాగో కైబ్సి

జె.వి.సుబ్బలక్ష్మి



**రైలు** దిగేటప్పటికి మూర్తి గబగబా ఫ్లాట్‌ఫారం మీద నడుస్తూ కన్పించాడు. "హలో, మూర్తీ" అని కేకేశాను. "హలో ,శేఖర్" అంటూ నా దగ్గరికి వచ్చి చేతిలో సూట్‌కేసు అందుకుంటూ, "ఏరా, ప్రయణం బాగా జరిగిందా" అన్నాడు.

"ఆ! అదే బాగు. రైలు కేవలం ఒక్క గంట మాత్రమే లేటు" అన్నాడు మూర్తి వంక జాలిగా చూస్తూ. "అవును!నువ్వు స్టేషనుకు వచ్చి ఎంతసేవయింది! గంట సేపూ వెయిట్ చేశావా" అన్నాను.

"నాకేం పిచ్చనుకున్నావా గంట ముందుగా వచ్చి స్టేషన్లో కూర్చోడానికి! నేను వచ్చి అయిదు నిముషాలే అయింది" అన్నాడు వాడు.

"అయితే, ఫోన్ చేసి రైలు లేటుగా వనుందని తెలునుకున్నావన్న మాట" అన్నాను.

"పోరా, నువ్వింకా బి.సి.నాటి ఆలోచనలు చేస్తున్నావు. రైళ్ళు గంట లేటు కాకుండా సరిగ్గా టైముకు ఎప్పుడన్నా వస్తున్నాయా! టైమ్‌టేబుల్లో టైముకు గంట కలుపుకుని ఆ టైముకు వచ్చానంతే" అన్నాడు మూర్తి కాలరెగరేస్తూ. వాడి తెలివికి, ముందుచూపుకు సంతోషించకుండా ఉండలేకపోయాను.

"అంతేకాదు, ఎప్పుడన్నా రైలు టైముకు రావడం జరిగితే ఫోను చేసి చెపితే నేను స్టేషనుకు వస్తాను. కుదరకుంటే మీరే ఏ ఆటో అయినా పట్టుకు వచ్చేయండి అని నేను మన వాళ్ళందరికీ చెప్పే ఉంచాను" అని కూడా అన్నాడు.

మాటల్లో ఇద్దరం మెల్లిగా రోడ్డెక్కాం. ఆటో పిలిచాడు మూర్తి. ఆటో డ్రైవరు వస్తానని చెప్పకుండా మీటరు వెనక్కి తిప్పి 'కూర్చో' అన్నట్లు ఒక చూపు చూశాడు. అదే పది కోట్లనుకుని (పదివేలనంటే ఈ కాలంలో బాగుండదు. రూపాయి విలువ బాగా పడిపోయింది కదా) ఆటో ఎక్కాము.

మూర్తి ఇంటి ముందుకు రాగానే ఆటో దిగి పది రూపాయల నోటు డ్రైవరు చేతిలో పెట్టాడు. డ్రైవరు మీటరు వంక చూసి నిర్లక్ష్యంగా "చిల్లర నై హై,సాబ్" అన్నాడు పది రూపాయల నోటు మూర్తికి అందిస్తూ. మీటరు ఏడున్నర చూపుతోంది. రెండున్నర రూపాయి చిల్లర కాజేస్తాడు పది రూపాయల నోటు ఇస్తే. మూర్తి దగ్గర చిల్లర లేదు. నా దగ్గరా లేదు. నేను ఆటో దిగబోతుండగా మూర్తి చటుక్కున-

"ఒరే, నువ్వు దిగబోకు. అలాగే కూర్చో" అని ఆటో డ్రైవరుతో ఒకసారి ఫలానా థియేటరు దాకా వెళ్ళి వెనక్కురా అన్నాడు.

నేను కంగారుగా "ఇప్పుడు థియేటరు కెందుకురా "అన్నాను.

"అక్కడి దాకా వెళ్ళి తిరిగొస్తే చిల్లర ఇవ్వక్కర్లే

డు. పది రూపాయలు సరిపోతుంది" అన్నాడు మూర్తి ఆటో ఎక్కుతూ.

ఆటో బయలుదేరింది.

డ్రైవరు దారి మళ్ళించాడు. మూర్తి కంగారుగా "అరెందుకు. ఇధర్ సే చలో" అన్నాడు దగ్గరి దారికేసి చూపుతూ.

"ఉధర్ జులూస్ చల్ రహా. సాబ్?" అన్నాడు డ్రైవరు.

"జులుం చేస్తున్నారా?ఎవరు" అన్నాను నేను.

"ఛ! ఊరుకో.నీకు ఉర్దూ రాదని వాడికి తెలియనివ్వకు. జులుం. కాదు- జులూస్ అంటే ఊరేగింపు అన్న మాట" అన్నాడు మూర్తి. మేము వెళ్ళే దారి ముందు వరసగా బస్సులు. కార్లు. ఆటోలు ఉన్నాయి. మాఆటో ఒక డబుల్ డెక్కర్ బస్సు వెనక పడ్డది. నేను మీటరు వంక చూస్తున్నాను. తీరా మీటరు పది రూపాయలు చూపేసరికి మేము థియేటరు దగ్గరే ఉన్నాం. మళ్ళీ ఇంటిదాకా వెళ్ళాలంటే చిల్లర సమస్య ఎదురౌతుంది. మాట్లాడకుండా ఆటో దిగి పది రూపాయలు డ్రైవరు చేతిలో పెట్టాం.

'ఇప్పుడేం చేద్దాం' అన్నట్లు మూర్తి వంక చూశాను.

"చెయ్యడానికేముంది? అదుగో- ఎదురుగా హొటల్లో టిఫిన్ చేసి మర్నింగ్ షోకు వెళ్దాం. భోజనం టైముకి ఇల్లు చేరొచ్చు అన్నాడు" మూర్తి.

"చిల్లరుందా చెప్పు ముందు. లేకుంటే చిల్లర బదులు మనం పిండీ రుబ్బడమో. బల్లలు తుడవడమో చెయ్యాలి" అన్నాను నేను.

"వాడు మన కావన్లు చెప్పడులే. చిల్లర ఇవ్వాల్సింది వాడు. మన దగ్గర ఓ రూపాయి ఎక్కువే తీసుకుని. 'చిల్లర లేదు. సార్' అంటాడు. అందులో మనం వచ్చింది సినిమాకని తెలిసిందంటే ఇక బెట్టు చేస్తాడు. చిల్లర వదిలి అయినా సినిమాకు పారిపోతామని తెలుసు."

టిఫిన్ చెయ్యడం అయ్యాక బిల్లు చెల్లించగా మాకు డెబ్బై అయిదు పైసలు చిల్లర రావలసి ఉంది. కౌంటరులో ఉన్నతను మాకు చిల్లరకు బదులుగా మూడు చాక్లెట్లు ఇచ్చాడు. నేను ఒక చాక్లెట్ నోట్లో వేసుకోబోయాను. మూర్తి చటుక్కున నా చేతిలోంచి లాక్కుని జేబులో వేసుకున్నాడు దాన్ని, "అది తినడానిక్కాదు" అంటూ.

ఇద్దరం సినిమా హాలుకు వెళ్ళాం.

నాలుగు రూపాయల టిక్కెట్లు రెండు తీసుకోబోయాడు మూర్తి.

"నాలుగు రూపాయల టిక్కెట్టు తీసుకుంటే నాలుగు పరిష్కారాలున్నాయి. సార్! చిల్లర ప్రాబెమ్ వదిలించుకోడానికి. రెండు రూపాయల చిల్లర వదులుకోండి. లేదా అయిదు రూపాయల టిక్కెట్లైనా తీసుకోండి; లేదా రెండు రూపాయలకు బదులు రెండు పాప్‌కారన్ పొట్లాలు తీసుకొండి; లేదా చివరగా మీ దగ్గర ఎనిమిది రూపాయలుంటే ఇవ్వండి" అన్నాడు బుక్కింగు కింగు. వాడినిప్పుడు క్లర్కు అనగూడదు.

మూర్తి పాప్‌కారన్ పొట్లాలు రెండు తీసుకుని టిక్కెట్లు తీసుకున్నాడు.

"తినొచ్చా" అన్నాను నేను మూర్తి ఇచ్చిన పొట్లం తీసుకుంటూ.

"ఇవి తినొచ్చు- చాక్లెట్లు మాత్రమే తినగూడదు" అన్నాడు మూర్తి.

"అదేం" అన్నాను.

"ఇప్పుడు కాదులే. తరవాత చెప్తాను- అదో పెద్ద కథ."

"ఇవేమిటి. దీనిపేరు పాపకారణాలా?"

"పాపకారణాలు కావు. పాప్‌కార్న్. ఇక్కడ ఇవి చాలా ఎక్కువగా తింటారు. అచ్చ తెలుగులో చెప్పాలంటే మొక్కజొన్న పేలాలు అన్న మాట. వీటి తరవాత జనం ఎక్కువగా తినేవి మిరపకాయ బజ్జీలు. ఎగ్జిబిషన్‌లో కూడా అవే దొరుకుతాయి. ఈ ఊళ్ళో కర్ఫ్యూ పాసులుగా కూడా పనికి వస్తాయి" అన్నాడు మూర్తి.

"అదేమిటి?"

"ఈ ఊళ్ళో అన్ని జాతుల. మతాల వాళ్ళకీ కామన్‌గా ఒక పండగ ఉందిలే. దాన్ని కర్ఫ్యూ అంటారు. ఒకసారి మాపనివాడి తమ్ముడు మిరపకాయ బజ్జీల బండి నెట్టుకుంటూ వెళ్ళుతున్నాట్ట కర్ఫ్యూ టైములో. పోలీసు వచ్చి 'పాసుందా' అని అడిగితే నాలుగు బజ్జీలు పొట్లం కట్టి ఇచ్చి సలాం కొట్టాట్ట. అప్పుడు వాణ్ణి వీథిలోంచి రానిచ్చారుట."

సినిమా చూపిస్తున్నారు. ఏదో నడుస్తోంది. నాకేం సరదా వెయ్యలా. ఇంతలో హాస్యం కోసమే అన్నట్లు రెండు పాత్రలు వచ్చాయి. ఇద్దరికీ పడదన్న మాట. ఒకడు రెండో వాడిని ఏడిపించడం కోసం కాఫీ ఫ్లాస్కులో విరేచనాల మందు పోసి వస్తాడు. తరవాత వాడితో పాటు పొరపాటుగా వీడు కూడా ఆ మందు కలిసిన కాఫీ తాగుతాడు. ఆ తరవాత ఇద్దరూ టాయిలెట్‌కి పరుగెత్తడం... అది చూసి జనం నవ్వాలన్న మాట. నాకు నవ్వు రాలేదు.

"ఒరే. మూర్తీ! మోషన్ ఫిల్మ్ అంటే ఏమిట్రా" అన్నాను.

"అదేమిట్రా తెలియనట్లు అడుగుతావు. మోషన్ ఫిల్మ్ అంటే చలనచిత్రం కదా?"

"అనే నేనూ అనుకున్నా నిన్నాళ్ళూ. కానీ. ఈమధ్య వస్తున్న సినిమాలు చూస్తుంటే కాదనిపిస్తోంది. మోషన్ ఫిల్మ్‌లో మోషన్స్ సీను ఒకటి విధిగా ఉండాలనుకుంటాను. కాదా" అన్నాను.

సినిమా శిక్ష పూర్తయింది. ఇద్దరం బస్ స్టాండుకు నడిచాము. బస్సులో ఎక్కాక మూర్తి మేం వెళ్ళవలసిన చోటు చెప్పి రెండు టిక్కెట్లు తీసుకుని జేబులోంచి మూడు చాక్లెట్లు ఇచ్చాడు కండక్టరుకి. కండక్టరు అవి బాగ్‌లో వేసుకుని మరో రకంవి ఒకటి కాస్త పెద్దది. మరోటి కాస్త చిన్నది రెండు పిప్పర్‌మింట్లు ఇచ్చాడు. ఇదేమిటో అర్థంగాక తెల్లబోయి చూశాను నేను.

"మనకు హొటల్లో ఇచ్చిన మూడు పెద్ద చాక్లెట్లూ మూడు పావలా లన్న మాట.ఇప్పుడు నేను తీసుకుంది. ముప్పై పైసల టిక్కెట్లు రెండు. మనకు పదిహేను పైసలు. తిరిగి రావాలి కదా. కండక్టరిచ్చిన రెండు పిప్పర్‌మింట్లలో పెద్దది పది పైసలు.చిన్నది అయిదు పైసలు. ఇప్పుడు చిల్లర కింద ఇవే చలామణీ అవుతున్నాయిలే. అందుకే ఇందాక నిన్ను తినవద్దంది. మా చిన్న వెధవకు కూడా తినడానికి బిస్కెట్లు ఇస్తాను కానీ. ఎప్పుడూ చాక్లెట్లు తిననివ్వను."

"అదన్న మాట సంగతి. ఇకముందు ముందు చిల్లర నాణాలకు బదులు మింటులో ఇవే తయారు చేస్తారు కాబోలు. అందుకే ఈ సంగతి ముందుగా ఊహించి దీనికి పిప్పర్‌మింటు అని పేరు పెట్టారు" అన్నాను.

భోజనాలయాక రవంత సేపు నడుం వాల్చాము. సాయంత్రం మూర్తి తన స్నేహితుడొకడు చార్మినార్ దగ్గర ఉన్నాడని వెళుతుంటే ఇంటి దగ్గర కూర్చుని చేసేదేముందని నేను కూడా బయలుదేరాను. స్నేహితుడింటికి వెళ్ళి తిరిగి వచ్చేప్పుడు చార్మినార్ దగ్గర రాళ్ళ గాజులూ అవీ బాగా దొరుకుతాయని చెప్పాడు మూర్తి.

మా ఆవిడకు హైదరాబాదు నుండి ఏదో ఒకటి తెస్తానని చెప్పి వచ్చాను నేను ఇక్కడికి బయలుదేరేముందు. ముందు మాఆవిడ నాతోటి హైదరాబాదు రావాలని సహగమనానికి ఆయత్తురాలైంది. కానీ, నేను మరోసారి తీసుకువెళతానని చెప్పి వచ్చేశాను. మూర్తీ, నేనూ చార్మినార్ దగ్గర గాజులు చూస్తున్నాము. ఒక యువతి అయిదేళ్ళ కుర్రవాడిని వెంటబెట్టు కొచ్చింది. గాజులు బేరం చేస్తోంది. నాకు గాజుల గురించి తెలియదు. అదీగాక పొరుగూరు నుంచి తీసుకువెళ్ళేప్పుడు మంచివిగా సెలెక్టు చేసి తీసుకువెళ్ళాలి గదా. ఆ యువతిని అడిగాను, నాకు మంచి గాజులు సెలెక్టు చేసి పెట్టమని. "ఒక్క క్షణం ఉండండి - నేను తీసుకుని మీకు తరవాత తీసిస్తాను" అంది ఆవిడ. ఆవిడ గాజులు తీసుకుని డబ్బులిచ్చింది. ఇంతలో వాళ్ళబ్బాయి "అమ్మా...అమ్మా ...నాయనమ్మొస్తోందీ" అని అరిచాడు కంగారుగా. ఆ యువతి హడావుడిగా కొడుకుని తీసుకుని షాపులోంచి బయటికి పరుగెత్తింది.

"ఈ కాలంలో గూడా అత్తగారిని చూసి భయపడే కోడళ్ళున్నారా" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"అత్తగారేమిటి? భయపడ్డ మేమిటి! ఎవరి గురించి నువ్వు మాట్లాడేది" అన్నాడు మూర్తి.

"అదే, నాయనమ్మ వస్తోంది అనగానే ఆ యువతి బయటకి పరుగెత్తిందిగా కంగారుగా."

"అదా! నాయనమ్మ కాదు. నైన్ ఎమ్. అది బస్సు నంబరు. ఇక్కడి నుండి సనత్‌నగర్ వెళుతుంది. ఈ బస్సు పోతే మళ్ళీ గంట దాకా మరో బస్సు లేదు. అందుకే ఆ అమ్మాయి పరుగెత్తింది."

మేము రెండు బస్సులు మారి ఇంటికి వెళ్ళాలి.

అదీ సంగతి




మళ్లీ ఏదో సర్క్యులర్ ప్రాంతీయ భాషలో వచ్చినట్లుంది సార్..

బస్సు దిగి మరో బస్సు కోసం చూస్తూ నిలబడ్డాం. వక్కన ఏవో మాటలు విన్పించినట్లయింది. 'ఎవరా' అని చూశాను. మాతో ఎవరూ మాట్లాడలేదు. మళ్ళీ మాటలు వినిపించాయి. ఈసారి జాగ్రత్తగా విన్నా. మాటలు నేల లోంచి వినవస్తున్నాయి. ఏదో త్రవ్వి పూడ్చినట్లుంది అక్కడ నేల. 'ఇదేమిటి' అని మూ ర్తి నడిగాను.

"టెలిఫోన్ కేబుల్స్ కోసం త్రవ్వారు" అన్నాడు మూ ర్తి.

"అయితే, కేబుల్లోంచి మాటలు విన్పిస్తున్నాయన్న మాట" అని నేను నేలపైన వంగి కూర్చుని తల బాగా నేలకాన్చి "హలో... హలో" అన్నాను.

"హలో... హలో" అని వినిపించింది.

"చూడు—మాటలు వినిపిస్తున్నాయి" అన్నాను.

"నీ మాటలేనేమో" అన్నాడు మూ ర్తి.

"కాదులే—ఉండు" అని "హలో! మీరెవరు? ఎక్కడి నుండి మాట్లాడుతున్నారు" అన్నాను.

"నేను ఈ గోతిలోంచి మాటాడుతున్నానండీ."

"మీ పేరు?"

"అయ్యా, ముందు న న్నీ గోతి లోంచి బయటికి తియ్యండి" అన్నాడు లోపలున్న మనిషి.

దగ్గర్లోనే టెలిఫోన్సు ఆఫీసుంది. పరుగెత్తుకు వెళ్ళి 'ఇదీ సంగతి' అని చెప్పాం. "ఇప్పుడు మళ్ళీ త్రవ్వితే పూడ్చడానికి టైము పడుతుంది. రేపట్నుంచీ అక్కడ రోడ్డు వెడల్పు చే సే పని ఉంది. వాళ్ళకు రాయాలి మళ్ళీ. కష్టం, సార్. కుదరదు" అన్నారు వాళ్ళు. సరే, చే సేదేముందని రోడ్ల ఆఫీసుకు వెళ్ళాం. "వాళ్ళు చెప్పిందే మేమూ చెప్తున్నాం, సార్. ఒక పని చెయ్యండి. అతడి పేరేమిటో కనుక్కుని రండి. రోడ్డు వెడల్పు చేశాక అతడి పేరు ఈ రోడ్డుకు పెట్టేద్దాం" అన్నారు అక్కడి వాళ్ళు. మొత్తంమీద మానవతా దృష్టితో ఇద్దరూ ఒక ఒప్పందాని కొచ్చి గోతిలోంచి మనిషిని బయటికి తీశారు.

గోతిలోంచి బయటికి వచ్చిన మనిషిని ముందు స్నానం పానం, తిండీ తిప్పలూ గురించి అడిగాను. మూ ర్తి అతడిని తమ ఇంటికి రమ్మన్నాడు. దాని కా గోతిలో మనిషి చిన్నగా నవ్వి—

"నాకు ఇప్పుడేం అవసరం లేదండీ" అన్నాడు.

"అదేమిటి! మీరనలు గోతిలో ఎప్పుడు పడ్డారు" అన్నాను నేను.

"నిన్న పొద్దున, సార్."

"మరి..."

"నాకు ఇప్పుడేం అవసరం లేదన్నానుగా. నన్ను నమ్మండి" అన్నాడు గోతిలో మనిషి.

"ఇంతకూ మీరు గోతిలో ఎలా పడ్డారు? ఇప్పటిదాకా తిండి లేకున్నా కనీసం గాలికూడా పీల్చకుండా ఎలా ఉన్నారు" అన్నాడు మూ ర్తి.

"నిన్న పొద్దున ఇక్కడ బస్సు కోసం నిలబడ్డానండీ. బస్సు వచ్చింది వేగంగా. నా మీదికి వస్తుందేమో అని ఒక్కడుగు అటు వేశాను. అంతే. గోతిలో పడ్డాను. ఆఫీసు హడావుడి—బస్సు మిస్సవకుండటం కోసం అందరూ తోసుకుని బస్సు ఎక్కడంలో నన్ను గమనించలేదు. ఆ గొయ్యి చిన్నది. పాతాళం లోకి ఉంది. గోతిలో పడ్డ నేను పాతాళంలోకి వెళ్ళాను. అక్కడ రెండు మత్స్య మానవుల కుటుంబాల మధ్య కలహం వచ్చింది. 'ఎందుకండి' అని అడిగాను. దానికి ఓ కుటుంబం పెద్ద—

'చూడండి—వాడు మురుగునీళ్ళలో పుట్టిన మత్స్య మానవుడు. మేము త్రాగునీటిలో పుట్టినవాళ్ళం. మాకులమేమిటి. వాడి కులమేమిటి! వాడి కొడుక్కు నేను పిల్లనివ్వాలట. అదేమంటే, వాళ్ళు ప్రేమించుకున్నారంటాడు. దీన్ని ఇల్లు కదలవద్దన్నాను. అసలు మురుగునీళ్ళ గుంటలో దీనికేం పని చెప్పండి. నా వంశాన చెడపుట్టింది' అన్నాడు. మంచి మత్స్య మానవు డతడు.

'ఇందులో మీ అమ్మాయి తప్పేమీ లేదండి. మా భూలోకంలో కులాలను ఈమధ్య పడగొట్టేస్తున్నారు. అలాగే మంచినీళ్ళను, మురుగునీళ్ళను కలిపేస్తున్నారు. ఓసారి మాఆవిడ డ్రైనేజిలో పోగొట్టుకున్న ఉంగరం మంచినీళ్ళ వంపులోంచి పడింది. మా అమ్మాయి మంచినీళ్ళే అనుకుని వెళ్ళి ఉంటే అది మురుగు నీళ్ళ గుంటలోకి దారి తీసి ఉంటుంది. అయినా, నీళ్ళన్నీ కలిసిపోయాక ఇక మంచినీళ్ళేమిటి, మురుగునీళ్ళేమిటి? ప్రేమించుకున్న వాళ్ళను విడదీయకండి. వాళ్ళిద్దరికీ పెళ్ళి చెయ్యండి' అన్నాను.

అంతట వాళ్ళిద్దరికీ నా మాటల్లోని నిజం అర్థమయి పిల్లల పెళ్ళి జరిపించారు. నిన్న, ఈరోజు అక్కడే జలకాలు, భోజనాలు. అందుకే ఆకలి లేదన్నాను" అని వివరించాడు గోతిలో మనిషి.

మరునాటి ఉదయం మూ ర్తి ఆఫీసుకు త్వరగా బయలుదేరాడు.

"అదేమిట్రా ఇంత పొద్దునే" అన్నాను.

"అవున్రా, ఈరోజు ఆఫీసులో చచ్చే పనుంది. నిన్ననే సెలవు ఇవ్వనని మొండికేశాడు మా బానుదేవుడు. ఎలాగో బతిమాలి ఒప్పించాననుకో, నువ్వు వస్తున్నావని" అన్నాడు.

"మీ ఆఫీసరు బెంగాలీయా?"

"కాదు—ఏం?"

"బానుదేవుడంటేను-"

"బాను-దేవుడనాలి మరి. వాడి... చేతిలో మన ప్రాణాలున్నాయి కదా. నన్ను త్వరగా వెళ్ళనీరా, బాబూ. లేకుంటే బానుదేవుడు జోకు లేస్తాడు."

"జోకు లెయ్యడం మంచిదేగా. సంతోషించక అలా బిగుసుకు పోతావేం?"

"ఆ జోకులు ఎలా ఉంటాయో తెలుసా? మన మీదే వేస్తాడు. నీ మొహంమండ, నీ పిండాకూడు, గబ్బిలంగాడు... అసలెప్పుడైనా ఆఫీసులో పని చేశావా నువ్వు? నువ్వు ఊర్లోనే ఉన్నావా?— ఇల్లాంటివి. వాటికి మనం నవ్వాలి ఏడవలేక. మనం నవ్వాం కనక అవి జోకు లనుకుంటాడు వాడు" అన్నాడు మూ ర్తి. వెళుతూ వెళుతూ—

"ఇదుగో—సాయంకాలం నేను వచ్చేసరికి ఏ టయిమవుతుందో! నీకు రైలుకు టైమైతే వెళ్ళు. నా కోసం చూడకు. మరేం అనుకోకురా. ఇదుగో— సిటీలో ఎటైనా తిరగాలనుకుంటే వెళ్ళిరా. కాస్త ఉర్దూలో ఏడుస్తూండు. చిల్లర దేవుళ్ళని మర్చిపోకు. అవేరా—గుప్పెడు చాక్లెట్లు దగ్గిరుంచుకో. బస్సు నంబర్లు అడిగి ఎక్కు" అని అత్త గారింటికి పంపే అమ్మాయికి చెప్పినట్లు చెప్పాడు.

నేను అన్నింటికీ తల ఊపాను. వాడు వెళ్ళిపోయాడు.

సాయంకాలం ట్రెయిను ఏ టయిముకుందో చూద్దామని పేపరు చూడాలనుకున్నాను. మూ ర్తి ఇంటికి పేపరు వస్తుంది. పాత పేపర్లు నా గదిలో మంచం కింద పడేశామని చెప్పాడు. ఆవిడను పిలిచి "కాస్త మండే పేపరు తెచ్చి ఇవ్వమ్మా" అన్నాను. ఆవిడ ఓ చిత్తు కాగితం తెచ్చి ఇచ్చింది. "అగ్గిపెట్టె ఉందా? ఇమ్మంటారా, అన్నయ్యగారూ" అంది. "ఎందుకమ్మా" అన్నాను. "ఏదో కాగితం అంటిస్తానన్నారుగా" అంది.

"అదా? నే నడిగింది మండే కాగితం కాదమ్మా. సోమవారం నాటి ఇంగ్లీషు పేపరు. రైలు ఏ టయిముకు వెళుతుందో చూద్దామని" అన్నాను.

ఆవిడ సోమవారం పేపరు తెచ్చిచ్చింది. టైము చూసుకున్నాను. ఆమెకు చెప్పి రైల్వే స్టేషనుకు బయలుదేరాను. ఆటోలో వెడదామంటే దారి తెలియని నన్ను ఊరంతా తిప్పి ఎక్కువ డబ్బు వసూలు చేస్తాడనుకుని బస్సు స్టాండులో నిలబడ్డాను. ఓ బస్సు వచ్చి ఆగింది. ఒకావిడ నా దగ్గరకు వచ్చి "కోటీ జాతే" అంది. నాకు అర్థం కాలేదు. నన్ను పిచ్చివాడిలా చూచి బస్సు డ్రైవరును అడిగింది. "నాంపల్లి జాతే" అన్నాడు డ్రైవరు.

'ఏమిటి? ఈ ఊళ్ళో బస్సులకు గూడా జాతులుంటాయా' అనుకుని నా వక్కనున్నాయన్ని అడిగాను. ఆయన 'జాతే' అంటే వెళుతుందా, వెళుతుంది అని అర్థం చెప్పాడు. ఆమాత్రం కూడా భాష రానందుకు నన్ను నేను తిట్టుకున్నాను. నేను ఎక్కవలసిన బస్సు వచ్చింది. ఓ తెలుగు వచ్చిన తెలుగాయనను (ఇక్కడ తెలుగు వాళ్ళు కూడా ఉర్దూ మాట్లాడతారు కదా) అడిగి, అదే నేను ఎక్కవలసిన బస్సు అని తెలుసుకుని ఎక్కాను. బస్సులో బోలెడు జనం... నేను ఎలాగో తిప్పలు పడి లోపలికి వెళ్ళగలిగాను. ఓ కుర్రాడు అరచేయి మాత్రం బస్సు బాడీకి ఆనించి మిగతా శరీరమంతా గాల్లో వదిలేసి వేలాడుతూ నిలబడ్డాడు. నాతో పాటే అతడూ బస్సు దిగాడు. "నువ్వు మెజీషియన్‌వా" అని అడిగా నతణ్ణి. "కాదు, సార్" అని అరచేతికి కట్టుకున్న అయస్కాంతం చూపాడు. "రద్దీ టైములో బస్సు పట్టుకోవాలంటే ఇదే మంచి పద్ధతి, సార్" అన్నాడు.

స్టేషనులో పోర్టరు నా పెట్టె అందుకుని, "అయిదు రూపాయలు, సార్" అన్నాడు. "వద్దులే—నేను తీసుకుపోగలను" అన్నాను. "కుదరదు, సార్. నేను కూడా లేకుంటే మిమ్మల్ని ట్రెయిను ఎక్కనివ్వరు" అని పెట్టె లాక్కుని పరుగెత్తాడు. నేను అతడి వెంట పరుగెత్తాను. ఎలాగో ట్రెయినులో ఓ పెట్టెలోకి జొరబడ్డాడు. నేను అతడి వెనక నిలబడ్డాను. అతడు నా పెట్టెను టూ టయర్‌లో పై బెర్తున విసిరేసి నన్ను కూడా ఎత్తి సూట్‌కేసు వక్కన పడేశాడు. అయిదు రూపాయలూ అతడికి ఇచ్చాను. ఆ తరవాత ఎక్కిన జనాన్ని చూస్తే జాలి వేసింది. వాళ్ళకు నిలబడ్డానికి కూడా చోటు లేదు. ఒకడు గంపలో పళ్ళు పెట్టుకుని 'నారంగీ' అంటూ పెట్టె ఎక్కాడు. 'ఈ జనంలో రంగిని ఎక్కడ వెతుక్కుంటాడు, పావం' అనుకున్నా. వా డలా అరుస్తూనే ఉన్నాడు. రంగి దొరకలేదు. రైలు మాత్రం బయలుదేరింది, కూత వేసుకుంటూ.

*